1.

# సుఖదుఃఖములు విడదీయరానివి

**దైవాధీనం జగత్సర్వం సత్యాధీనంతు దైవతమ్**
**తత్ సత్యముత్తమాధీనం ఉత్తమః పరదేవతా.**

దివ్యాత్మ స్వరూపులారా! ప్రేమస్వరూపులారా!

ఈ జగత్తంతయూ దైవాధీనమై వుంటున్నది. అట్టి దైవము సత్యమునకు ఆధారమై వుంటున్నది. అట్టి సత్యము పవిత్రమైన గృహమునందు ఆధీనమై వుంటున్నది. యీనాటి మానవుడు సత్యస్వరూపుడు కావాలి. సత్యమును ఆధీనము చేసుకోవాలి.

**సత్యంబునందుండి సర్వంబు సృష్టించె**
**సత్యమందణగెను సర్వ సృష్టి**
**సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న**
**శుద్ధసత్త్వమిదియె చూడరండి.**

ప్రతి మానవుడు సత్యమునుండి ఆవిర్భవించాడు. సత్యమునుండి జీవిస్తున్నాడు. సత్యమునందే లయమవుతున్నాడు. తానే సత్యస్వరూపుడు. ఇట్టి సత్యాన్ని ప్రతి వ్యక్తి గుర్తించినప్పుడు జగత్తంతయూ స్వర్గముగా మారుతుంది. ఈనాటి మానవుడు కోరవలసింది సుఖము కాదు. సుఖదుఃఖములు రెండుకూడను ఎక్కడ ఆవిర్భవించునో దానిని తనయొక్క ఆధీనములో చేర్చుకోవాలి. సుఖముకంటే మానవునకు ఎక్కువగా జ్ఞానబోధ గావించినది దుఃఖమే. ఏ మహనీయుల చరిత్ర మనము చూచినప్పటికి దుఃఖమునందే వారు ఉన్నత జ్ఞానము సాధిస్తు వచ్చారు. దుఃఖములేకుండా మనకు జ్ఞానము లభ్యముకాదు. దుఃఖము మానవునకు అమితమైన జ్ఞానాన్ని బోధిస్తుంది. ఈ సత్యాన్ని మానవుడు గుర్తించుకోనలేక సుఖము, సుఖము, సుఖమని ఆశిస్తున్నాడు. సుఖముకూడా అవసరమే. ఎప్పుడు సుఖము మనకు ప్రాప్తిస్తుంది? దుఃఖమును జయించినప్పుడే సుఖము ప్రాప్తిస్తుంది. కనుక ప్రతి మానవుడు సుఖమును ఏవిధంగా స్వాగతము గావిస్తున్నాడో, అదే విధముగా దుఃఖాన్నికూడా స్వాగతించాలి.

srisathyasaivachanamrutam

**కష్టసుఖములు రెండును కలసియుండు**
**వాని విడదీయనెవరికి వశముగాదు**
**సుఖము ప్రత్యేకముగనెందు చూడబోము**
**కష్టము ఫలించెనేని సుఖంబటంద్రు.**

సుఖము ఎక్కడనుంచి వచ్చింది. దుఃఖమును, కష్టమును జయించినపుడే సుఖము ప్రాప్తిస్తుంది. ఈనాటి యువకులు, యువతులు ఈ సుఖమునకు బానిసలవుతున్నారు. దేశముయొక్క సౌభాగ్యమంతయు వీరిపైన ఆధారపడి యున్నది. మానవులు అనేక విధమైనట్టి అవస్థలందు, అనేక విధమైన అనుభూతులు పొందుతున్నారు. జాగ్రత అవస్థయందు మానవుడు అనేక విధములైన అనుభూతులు అనుభవిస్తున్నాడు. అదే విధముగా స్వప్నావస్థలందు తనకు తాను సృష్టించుకొనుచున్నాడు. అంతియేకాదు తన కష్టసుఖములను తానే కల్పించుకొనుచున్నాడు. సత్యానుభూతిని తాను కల్పించుకొని అనుభవించుచున్నాడు. నిద్రావస్థయందు తనను తాను మరచి ఆనందాన్ని అనుభవిస్తున్నాడు. జాగ్రత, స్వప్న, సుషుప్తి యీ మూడుకూడను ఒకే వ్యక్తియొక్క అనుభూతులే. కనుక మానవునియొక్క అనుభూతులు సమయస్ఫూర్తిగా చేకూరుతూ వుంటున్నవి. మానవునియొక్క జయాపజయములు, కష్టనష్టములు, సుఖదుఃఖములు అన్నీకూడను కాలానుగుణముగా అనుభవించేటువంటివే. భగవంతునికి 'సిద్ధస్వరూపాయ నమః' అని అంటారు. అనగా మానవునికి అభీష్టములు సిద్ధింపచేసేటువంటివాడు కనుకనే అతనికి సిద్ధస్వరూపుడు అన్నారు. దీనియందే అమోఘుడు అంటారు. మోఘమనగా పరిమితమైనటువంటిది. అమోఘమనగా అనేకమైనటువంటిది. కనుక భగవత్సంకల్పములు అమోఘమైనటువంటిది, అనంతమైనటువంటిది. అప్రమాణమైనటువంటిది కనుకనే అప్రమాణాయా నమః అని కూడా అంటారు. ఏది మనకు సంభవించినా అన్నీ భగవత్సంకల్పముగానే భావించాలి. సుఖదుఃఖములు రెండుకూడను భగవత్ ప్రసాదములుగానే భావించాలి. అందులోనే మనకు ఆనందము యిమిడి వుంటున్నాది. కాని తాత్కాలికముగా మనకు అపజయము, కష్టము, నష్టము సంభవించినప్పుడు మనము దుఃఖమనుభవిస్తున్నాము. కారణములేని కార్యము జగత్తులో కానరాదు. అన్నము తినాలంటే ఆకలి కలగాలి. నీరు త్రాగాలంటే దాహము కలగాలి. సుఖము అనుభవించాలంటే కొన్ని కష్టములు సంభవించాలి. మానవుడు నిరంతరం



srisathyasaivachanamrutam

ఆనందాన్ని అనుభవించాలన్నప్పుడు కొంచెం సంతోషము అనుభవించాలి. అన్నములేక ఆకలి తీరదు, నీరులేక దాహము తీరదు. దుఃఖములేక సుఖము ప్రాప్తించదు. ప్రతీ దానికి ఒక కారణము వుంటున్నాది.

## ప్రేమయే గొప్పతనము

అన్నింటికి మూలకారణమైనటువంటిది ప్రేమ. ప్రేమకు మించినటువంటి ధనము యీ జగత్తులో కానరాదు. మనము ఏదైనా వస్తువు కొనాలంటే ధనమును యివ్వాలి. మనము కొన్న వస్తువుకంటే యిచ్చినటువంటి ధనము గొప్పది. కాబట్టి ధనముతో జగత్తులో ఏదైనా కొనవచ్చు. కొన్న వస్తువు కాదు దీనికి ప్రమాణము. యిచ్చిన ధనమే దీనికి ఆధారము. ప్రేమద్వారానే మనకు అన్ని సుఖములు, సంతోషములు అభ్యమవుతున్నాయి. ప్రేమయే లేకున్న మనము ఏ సుఖము, సంతోషము అందుకొనలేము. కనుక అన్నింటికి మూలమైన ధనము, ప్రేమధనమే. ఇట్టి ప్రేమధనము ప్రతి మానవుడుకూడను సంపాయించాలి. యీ ప్రేమధనము సంపాయించినట్టి మానవుడు నిరంతరము ఆనందాన్ని అనుభవిస్తాడు. లోకములో అనేక కష్టనష్టములు మనలను చుట్టుకొని వుంటున్నాయి. యివి మన దగ్గర నిరంతరముగా వుండవు. దుఃఖముండిన కొంతకాలము తరువాత సుఖముకూడను ప్రాప్తిసున్నాది. ప్రతి క్షణము/దినము దీనిలోని మాధుర్యము పెరుగుతుందిగానీ తరగదు. ఏ విధముగా అయితే చెఱకును అనుభవిస్తున్న కొలది మాధుర్యము పెరుగుతుంటుంది. బంగారమును కాల్చేకొద్ది దాని తేజస్సు పెరుగుతుంది. అదే విధముగా మానవుడు కొన్ని అవస్థలందు కష్టనష్టములను తట్టుకొన్నప్పుడు తనయందున్న దివ్యశక్తి ఆవిర్భవిస్తుంది. కొత్త సంవత్సరములు మనకు సుఖాన్ని, సంతోషాన్ని, కష్టాన్ని, నష్టాన్ని తీసుకొని రావడం లేదు. సందీపన్ చెప్పినట్లు ప్రతి క్షణముకూడను నూతనమైనటువంటిదే. సెకండులేక నిముషమురాదు, నిముషములేక గంటలు రావు, గంటలు లేక దినములు కలుగవు. దినములులేక నెలలు రావు. నెలలులేక సంవత్సరములు రావు. సంవత్సరకాలమంతయు క్షణముపైననే ఆధారపడి వుంటున్నది. ప్రతి క్షణముకూడను పవిత్రముగా అనుభవించినపుడే యీ సంవత్సరము నూతన సంవత్సరమవుతుంది. ఏ క్షణము మనము ఎట్టి కార్యముచేత, ప్రవర్తనచేత కాలము గడుపుతున్నామో దాని ఫలితమే మన సంవత్సర ఫలితము.

sri sathyasaivachanamrutam

## సుఖదుఃఖాలు కర్మఫలాలే

ఒక పోస్టుమాన్ వుంటాడు. ఇంటింటా తిరిగి వారికి వచ్చిన జాబులన్నీ యిస్తుంటాడు. ఒక యింటిలో జాబు యిచ్చినప్పుడు వారు బోరున ఏడుస్తారు. మరొక యింటిలో జాబు యిస్తే వారు ఆనందిస్తారు. వారు ఏడ్చుటకు, వీరి ఆనందానికి పోస్టుమాన్ కారణమా? కాదు కాదు. వారికి వచ్చిన జాబులోని వార్తనే వారి దుఃఖానికి, ఆనందానికి కారణము. అదే విధముగా మానవునికి పోస్టుమాన్‌వలె భగవంతుడు సుఖములు, దుఃఖములు అందిస్తుంటాడు. కనుక మనము పవిత్రమైన జన్మలు, పొందాలంటే పవిత్రమైన కర్మలు ఆచరిస్తూ రావాలి. లోకములోని మంచిచెడ్డలు మారవలెనంటె మానవునిలో మార్పు రావాలి. వ్యక్తియొక్క ప్రవర్తన చక్కదిద్దినప్పుడే సమాజముయొక్క పరిస్థితి చక్కదిద్దబడుతుంది. పిల్లలు యిప్పుడు చదివారు. 'సహనావవతు, సహనౌభునక్తు, సహవీర్యం కరవావహై.....' అనగా.

**కలసిమెలసి తిరుగుదాం కలసిమెలసి పెరుగుదాం**
**కలసిమెలసి కలిమిచెలిమి బలముగుణము పెంచుదాం**
**కలసిమెలసి తెలుసుకొన్న తెలివిని పోషించుదాం**
**కలసిమెలసి కలిమితోడ చెలిమిగ జీవించుదాం**
**శాంతిశాంతి శాంతియని శాంతిపూజ చేయుదాం**

## భగవంతుడు నిరంతరము ప్రేమస్వరూపుడే

మనలో కలతలు లేనప్పుడే మనకు తెలివి కలుగుతుంది. కనుక, మానవులు ఎట్టి కలతలకు అవకాశము అందించకుండా, హృదయంలో అశాంతిని చేర్చకుండా, ప్రేమతో కలసిమెలసి జీవించినప్పుడు శాంతిగా వుండగలరు. భగవంతుడు నిరంతరము ప్రేమస్వరూపుడే. తనయొక్క ప్రేమనే జగత్తంతా వ్యాప్తి గావించుచున్నాడు. విశ్వం, 'విశ్' అనగా జగత్తు. 'వ' అనగా ప్రవేశించటం. విశ్వములో ప్రవేశించినటువంటివాడే భగవంతుడు. విష్+ణుః=విష్ణుః, 'విష్' అనగా జగత్తు 'ణుః' అనగా వ్యాపింపజేయడం. జగత్తంతా వ్యాపింప చేసినటువంటివాడే 'విష్ణుః'. విష్ణువు కారణస్వరూపుడు, విశ్వం కార్యస్వరూపం. కార్యకారణస్వరూపమే యీ జగత్తు. విశ్వములేక విష్ణువులేడు. విష్ణువులేక విశ్వము లేదు. రెండింటియొక్క ఏకత్వమే యీ జగత్తు. అందువలననే దీనికి ఆత్మ అన్నారు. ఆత్మ అనగా ఏమిటి? అదియే బ్రహ్మం అన్నారు. యీ బ్రహ్మము ఎక్కడనుండి వచ్చాడు.

srisathyasaivachanamrutam

విష్ణు నాభినుండి పుట్టాడు. సర్వవ్యాపకుడు కనుకనే యితనికి ఆత్మః అన్నారు. ఆత్మః అనగా పగలు అని ఒక అర్థము. పగలు అంటే దినము, అనగా అంధకారము దూరము గావించినటువంటిది, అదే వెలుగు. 'తమసోమ జ్యోతిర్గమయ', విష్ణువు అనగా అంధకారము తొలగించి జ్ఞానము కలిగించువాడు. ఇటువంటి అనేక దివ్యజ్ఞానములు అందించినటువంటిది యీ భారతీయ సంస్కృతి. యిటువంటి దివ్యమైన భావములు కలిగియున్న భారతీయ సంస్కృతిని గుర్తించటానికిగానీ, కాపాడవలెనన్న ఆశగాని యీనాడు ఎవరికి కలగటంలేదు. భగవంతుని ధ్యానించటము, జపించటము, పూజించటము యివియే ముఖ్యమని భావిస్తున్నారు. యీ పూజలు, జపములు, ధ్యానములు ఏ నిమిత్తమై చేస్తున్నామన్న సత్యాన్ని గుర్తించుకోలేకపోతున్నారు. తన గమ్యమేమిటో తాను గుర్తించుకోలేకపోతున్నాడు. గమ్యాన్ని తెలుసుకొనలేక, చేరుకునే మార్గము తెలియక ఎన్ని చేసినప్పటికి అన్నీ వ్యర్థమైపోతున్నాయి. అన్నింటియొక్క గమ్యము ప్రేమతత్వమొక్కటే. ప్రేమను సాధించాలి. అప్పుడే మనకు ఫలితము లభిస్తుంది. ఎట్టి పరిస్థితియందుకూడను మనము ప్రేమను వదలకూడదు, ప్రేమను మార్చుకోకూడదు, ప్రేమను మనము అనుభవించాలి. ప్రేమ ఉన్న చోట ద్వేషము కలుగదు. ప్రేమ ఉన్నచోట కష్టమన్నది సంభవించదు. ప్రేమ ఉన్నచోట దుఃఖము ప్రవేశించదు. కనుక ఇట్టి ప్రేమతత్వాన్ని మనము గుర్తించి వర్తించాలి. సర్వ సాధనలయొక్క మూలము, గమ్యము, లక్ష్యము ప్రేమ ఒక్కటే. ఇట్టి ప్రేమతత్వాన్ని మానవుడు అభివృద్ధి పరచుకోవాలి. అప్పుడే మానవత్వమన్నది సార్థకమవుతుంది.

### జ్ఞానా దేవతు కైవల్యం

ఎన్నో సంవత్సరములు గడిచిపోయినవి. మన వయస్సు పెరుగుతున్నాది, భావము తరుగుతున్నాది కాని పెరగటం లేదు. భావము పెరగాలి. భావశుద్ధియే జ్ఞానశుద్ధి. భావశుద్ధిలేక జ్ఞానశుద్ధి మనకు లభ్యముకాదు. 'జ్ఞానాదేవతు కైవల్యం' అట్టి జ్ఞానము మనకు లభ్యమైనప్పుడే కైవల్యం ప్రాప్తిస్తుంది. ప్రపంచములో మానవుడు ఎన్నియో విధములుగా కర్మలను ఆచరించాడు. ధనమును సంపాదించాడు. కీర్తి మర్యాదలను అందుకున్నాడు. గొప్ప శ్రీమంతునిగా రూపొందాడు. కాని యెన్ని సంపాదించినప్పటికి తన జీవితముయొక్క గమ్యము ఏమిటి అని తెలుసుకోలేకపోయాడు. దీనికి కారణము ఏమిటి? అనేకత్వములోని ఏకత్వమును పరిశీలన చేయక, ఏకత్వాన్ని భిన్నత్వముగా చూస్తున్నారు. అనేకత్వములోని

srisathyasaivahini.org

ఏకత్వము చూసిన మహనీయులు చాలా తక్కువ. ఏకత్వాన్ని అనేకత్వముగా చేసే మహానుభావులు ఎక్కువ. అదియే యీనాటి మన గొప్పతనము. అనేకత్వములోని ఏకత్వమును గుర్తించటం మంచితనము.

## సాధించవలసింది మంచితనము-గొప్పతనము కాదు

మంచితనమునకు గొప్పతనమునకు వున్న వ్యత్యాసము ఏమిటి? ప్రతి మానవునియందు దైవత్వమును దర్శించటమే మంచితనము. దైవమునందు మానవత్వమును గుర్తించటమే గొప్పతనము. 'చక్రి ఎందెందు వెతికినా అందందే గలడు' అన్నాడు, ప్రహ్లాదుడు. అది మంచితనము. ఎక్కడ వెతికినా విశ్వములో మానవత్వమే కాని దైవత్వము లేదని భిన్నంగా చెప్పినవాడు, హిరణ్యకశిపుడు. యిది గొప్పతనము. అనగా దైవమునందుకూడా మానవత్వమును నిరూపిస్తూ వచ్చాడు, హిరణ్యకశిపుడు. కనుక తాను గొప్పవాడైనాడు. ప్రతి మానవునియందు దైవత్వమును నిరూపించినవాడు ప్రహ్లాదుడు. అందుకే మంచివాడైనాడు. కనుక యీనాడు మనము లోకములో సాధించవలసినది ఏమిటి? గొప్పతనాన్ని కాదు, మంచితనాన్ని సాధించాలి. నా కొడుకు గొప్పవాడు కావాలి, గొప్ప అధికారి కావాలి, గొప్ప విద్యావంతుడు కావాలి, గొప్ప శ్రీమంతుడు కావాలి, అని కోరుకోవడము చాలా పొరపాటు. నా కొడుకు మంచివాడు కావాలి, మంచి పేరు సంపాదించాలి, మంచి కీర్తిని అనుభవించాలి, సమాజానికి మంచి పేరు తేవాలి, సమాజములో మంచి పేరు సాధించాలి. మంచితనములో ఎంత ఆనందమున్నదో, ఎంత గొప్పతనమున్నదో అదియే ప్రేమయొక్క లక్ష్యము. మీకందరికి తెలుసు రామాయణములో రాముడు ఎన్ని విద్యలు నేర్చాడో, రావణుడుకూడా అన్ని విద్యలు నేర్చాడు. కాని ఆ విద్యలను సార్థకం చేసుకోలేకపోయాడు, రావణుడు. ఆ విద్యలను జీర్ణించుకోలేకపోయాడు. కావున ఆ విద్యలన్నీ అజీర్ణరోగముగా రూపొందింది. కనుకనే దుర్గుణములన్నీ అనుభవిస్తూ వచ్చాడు. రాముడు నేర్చుకున్న విద్యలన్నీ సత్యములోపల ప్రవేశపెట్టాడు. సత్కర్మలలోపల వాటిని అంకితము చేశాడు. తాను మంచి గుణములను జీర్ణించుకున్నాడు. కనుకనే లోకకీర్తిని పొందాడు. కాబట్టి 'రామో విగ్రహవాన్ ధర్మః' అన్నారు. ధర్మస్వరూపాన్ని పొందినవాడు రాముడు. కనుక ప్రతి మాట, ప్రతి పని, ప్రతి కార్యము మంచిమార్గములో ప్రవేశపెట్టాలి. యీనాటి విద్యార్థులుగాని, విద్యార్థినులుగాని పవిత్రమార్గములో ప్రవేశించాలి. సమాజముయొక్క కీర్తిని మనము సంపాదించాలి. 'సర్వ లోకహితే రతః' అన్నారు.

sri sathyasai vachanamrutam

లోకక్షేమాన్ని మనము కోరాలి. యిది మొట్టమొదటి గుణము. 'సర్వ గుణ సంపన్నః', యిది రెండవది. మంచి గుణములను సంపాదించాలి. 'సర్వ జ్ఞానైక సంపన్నః', యిది మూడవది. అన్ని విధములైనటువంటి జ్ఞానమును సాధించాలి. లోకహితాన్ని కోరటం, సర్వ సద్గుణములను సంపాదించటం, సర్వ జ్ఞానమును సాధించటం. యీ మూడే మానవునియొక్క ప్రధానమైన అంగములు. యీ మూడింటిని సాధించినటువంటివాడు, ముల్లోకములను సాధించగలడు. కనుకనే 'త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధం త్రిజన్మ పాప సంహారం ఏక బిల్వం శివార్పణమ్' అన్నారు. భగవంతునికి మనము అర్పించవలసినది యీ మూడు గుణములతో కూడినటువంటి హృదయాన్ని అర్పితము చేయాలి. యీ మూడింటిద్వారా మనము జగత్తులో జీవించాలి. యీ మూడు గుణములే ప్రేమకు మూలాధారము. యిట్టి ప్రేమతత్వాన్ని మనము విశ్వసించలేనప్పుడు దేనినీ సాధించలేము.

**శాశ్వతానందము దైవ ప్రేమవల్లనే లభిస్తుంది**

ప్రేమస్వరూపులారా! ప్రతి మానవుడు కూడను ప్రేమమయుడే. కాని తన అభీష్టము నెరవేరినప్పుడు ఆ ప్రేమను అమితముగా పెంచుకుంటున్నాడు. ఆ అభీష్టము నేరవేరనప్పుడు తన ప్రేమను కృంగదీసుకుంటున్నాడు. ఇది సరియైన సాధనకాదు.

**కోరిక తీరిన వేళ నన్ గొప్పగ పొగడెదరోయి**
**కోరిక తీరకపోతే ఊరక తెగడుదురోయి**
**పాపంబౌ పని చేసి ఫలమాపద కలిగిన రోసి**
**కాపాడవు నీవనుచు నింద నాపై మోపెదరోయి.**

పాపము చేసి పుణ్యఫలము రావాలంటే అవుతుందా. చేదు విత్తనములు నాటి తీపి ఫలములు రావాలంటే జరుగుతుందా! తీపి ఫలములు కావాలనుకున్నప్పుడు తీపి విత్తనములు నాటాలి. అప్పుడే మనకు తీపి ఫలములు లభ్యమవుతాయి. కనుకనే ప్రపంచములో మనము మాధుర్యమైనట్టి జీవితము అనుభవించాలంటే పవిత్రమైనటువంటి కర్మలలో ప్రవేశించాలి. ఈ లోకసంబంధమైనటువంటి కర్మలన్నింటిలోను మనకు తాత్కాలికమైన సంతోషమును కలిగిస్తాయి. శాశ్వతమైన ఆనందము కేవలము దైవప్రేమద్వారానే మనకు లభ్యమవుతుంది. అన్యులందుకూడను దైవప్రేమ వుంటుండాది.

srisathyasaivachanamrutam

అట్టి దైవప్రేమను పొందడానికి ప్రయత్నము చేయాలి. లోకసంబంధమైన ప్రేమ మాలిన్యమును కలుగజేస్తుంది. తద్వారా జగత్తంతాకూడను మాలిన్యమును పొందుతుంది. కారణము మాలిన్యమైనటువంటి దృష్టితో చూడడంవలన జగత్తంతా మాలిన్యమైపోతుంది. కళ్ళకు ఎటువంటి రంగు అద్దములు వేసుకుంటామో ఆ విధముగా కనిపిస్తుంది. కనుక ప్రతి మానవుడు ప్రేమదృష్టి పెంచుకోవాలి. అప్పుడే లోకమంతా జ్ఞానముతోను, ప్రేమతోను నిండిపోతుంది. సర్వము సమత్వముగానే చూడాలంటే కేవలము ప్రేమవల్లనే సాధ్యమవుతుంది. ద్వేషము, అసూయ యిటువంటి దుర్గుణములను ఏనాడు దరిచేర్చకూడదు. ఆహారవిహారములచేత మానవునకు యిటువంటి గుణములు వస్తుంటాయి. ఎట్టి పరిస్థితులయందుకూడను ఈ గుణములకు ఆధీనము కాకూడదు.

**జీవులంతా దైవాంశములే**

యీ దినము 1998వ సంవత్సరము ప్రారంభమైనది. కనీసము యీనాటి నుండియైనా మీ హృదయాలను ప్రేమమయంగా మార్చుకోండి. సర్వులనుకూడను భగవంతుని బిడ్డలుగానే విశ్వసించండి. 'మమైవాంశో జీవలోకే, జీవభూతస్సనాతనః' అన్నారు. అందరూ దైవాంశములే. నేను దైవాంశమైనప్పుడు, దైవకార్యములు ఆచరిస్తున్నానా లేదా? దైవభావములు నాలో ఆవిర్భవిస్తున్నాయా లేదా? దైవప్రీతిగా నేను నడచుకుంటున్నానా లేదా? యీ విధముగా మనము విచారణ చేసుకుంటున్నప్పుడు నీవు 'మమైవాంశో' అన్న అర్థమునకు సార్థకమవుతావు. నీవు దానవ గుణములు ఆచరిస్తూ వుంటే 'మమైవాంశో' ఏ విధముగా అవ్వగలవు. కనుక యీనాటినుండి ప్రతి మానవుడు ప్రేమ గుణమును పెంచుకుంటూ రావాలి. ప్రతి దినము నీవు ప్రేమను అనుభవించు, అందరికి ప్రేమను పంచు. యీ విధముగా ప్రేమను పంచుకొని పోయినప్పుడు ప్రపంచమంతా ప్రేమమయంగా మారగలదు.

**దైవ ప్రేమను మీ హృదయాలలో నింపుకొని పొండి**

ఒక చిన్న విషయమును మీరు అర్థము చేసుకోండి. యీనాడు యిక్కడకు యిన్ని వేలమంది చేరినారంటే కారణము ఏమిటి? మీలో లేనటువంటిది, మీ యింటిలో లేనటువంటిది, మీ దేశములో లేనటువంటిది, యిక్కడ ఏదో వుంది. దానినే మీరు పొందడానికి వచ్చారు. అది యేమిటి, అదియే దైవప్రేమ, దివ్యప్రేమ. ఆ దివ్యప్రేమ మీలో లేదు, మీ యింటిలో లేదు, మీ దేశములో లేదు. కనుకనే మీరు యిక్కడకు పరుగెత్తి

srisathyasaivachanamrutam

వచ్చారు. నిజంగా ఆరోగ్యముగా వున్నవాడు హాస్పిటలుకు ఎందుకు వస్తాడు. ఆరోగ్యము లేనినాడే హాస్పిటలుకు వస్తున్నాడు. అదే విధముగా నీలో దివ్యప్రేమ వుండినట్లయితే యింతదూరము మీరు రారుకదా. అది లేదు కాబట్టి యింత దూరము వచ్చారు. వచ్చినారు కాబట్టి యీ దైవప్రేమను అందుకొని పోండి. మీ హృదయమును నింపుకొని పోండి. రోగి అయినవాడు యింటిలోనున్న లేదా హాస్పిటలులోనున్న మందు తీసుకొనక తప్పదు. హాస్పిటలులో వున్నాను కదాయని మందు తీసుకోక తప్పదు, తీసుకోవలసిందే. అదే విధముగా మీరు ఎక్కడ వుండినప్పటికి యీ ప్రేమ అనే మందుని స్వీకరించక తప్పదు.

**అడవిలోననున్న ఆకాశమున నున్న**
**పట్టణమున నున్న పల్లెనున్న**
**గుట్టమీద నున్న నట్టేటనున్నను**
**మదిని సాయి నిన్ను మరువడెపుడు.**

మీరు ఎక్కడనున్నను మీ హృదయములలో ప్రేమను మరువకండి. దిక్సూచి యంత్రము యే దిక్కున వుండినప్పటికి సూచిమాత్రము ఉత్తర దిక్కునే సూచిస్తుంది. అదే విధముగా మానవజీవితములో ఎట్టి పరిస్థితులయందున్నా దృష్టి మాత్రము దైవమువైపునే పోతుండాలి. ఏ పని చేసినప్పటికి దైవకార్యముగానే విశ్వసించాలి. ఏ స్థానమునకు వెళ్లినప్పటికి దైవస్థానముగానే విశ్వసించాలి. ఎవరిని చూచినప్పటికిని దైవస్వరూపముగానే విశ్వసించాలి. ఆ విధముగా విచారణ చేసినప్పుడు సర్వము దైవమయంగానే మారిపోతుంది. ఆనాటి పవిత్రమైనటువంటి మహర్షులందరుకూడను ఈ విధమైన చర్యలద్వారానే అంత కీర్తిని సంపాదించారు. కనుక యీనాటి బాలబాలికలందరుకూడను అటువంటి మంచి భావములను పెంపొందించుకొని సమాజములో ప్రవేశించి, సమాజమంతయూ ప్రేమమయంగా మార్చటానికి ప్రయత్నించాలి. ఏ పని చేసినప్పటికి ప్రజలందరూ ఆనందించే విధముగా చేయాలి, వారియొక్క ఆనందాన్ని అనుభవించటానికి ప్రయత్నించాలి.

**ఎప్పుడూ ఆనందంగా ఉండాలి**

మీకు తెలుసును 30వ తేదీన ప్రపంచము నలుమూలలనుండి స్టేడియంలో క్రికెట్టు ఆడడానికి వచ్చారు. అందరూ కూడను నీతిగా, చక్కగా, పవిత్రముగా, ఆనందముగా ఆడాలని నిర్ణయం చేసుకున్నారు. ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో ఆడుతూ వచ్చారు. ఆడినవారు

srisathyasaivachanamrutam

కాకుండా చూచినవారికి కూడా ఆనందాన్ని పంచుతూవచ్చారు. యువకులు అందరూ యీ క్రికెట్టు ఆటపై అభిరుచి చూపిస్తూ వచ్చారు. ఈ ఆటను చూడడానికి పల్లెలనుండి, పట్టణములనుండి యువకులు చాలామంది వచ్చారు. కనుకనే ఆటలు, పాటలు, మాటలవలన మానవులయొక్క హృదయము ఆనందముగా మారుతూ వస్తుంది.

**Life is a game, play it**
**Life is a dream, realise it**
**Life is a love, enjoy it**
**Life is a challenge, meet it.**

ఎటువంటి కష్టాలనైన ఎదుర్కొనడానికి ప్రయత్నించాలి. అదియే నిజమైనట్టి మానవ హృదయం. అట్టి పవిత్రమైన హృదయం మానవులయందే కనబడుతుంది గాని వేరే జీవులయందు కానరాదు. ఇట్టి పవిత్రమైన హృదయం కల్గిన మానవుడు దైవకార్యమును విస్మరించి, దైవభావమును విస్మరించి, భోగ భావమును పెంచుకొని అనిత్యమైనట్టి సుఖమును ఆశిస్తున్నాడు. మీరు శాశ్వతమైన, నిత్యమైన సుఖాన్ని పొందటానికి కృషి చెయ్యాలి. ఏ పని చేసినా, ఉద్యోగం చేసినా దైవకార్యంగా చేసుకో అదే జపము, ధ్యానము, యోగము. అంతేకాని పనులంతా వదలమని చెప్పటంలేదు.

**దుష్ట సంకల్పములు తొలగితేనే శాంతి**

**దుష్టసంకల్పములచేత దుఃఖితుడగును**
**సత్యసంకల్పముచేత సాధువగును**
**సకలసంకల్పశూన్యుడే శాంతినొందు**
**సత్యమును తెల్పు బాట శ్రీసాయి మాట.**

అందరూ శాంతి, శాంతి, శాంతి కావాలనుకుంటున్నారు. దుష్టసంకల్పములన్ని లోపల ఉన్నంతవరకు శాంతి చేకూరదు. అన్ని సంకల్పములు కూడను దైవసంకల్పములుగా మార్చుకోండి. అప్పుడే మీయొక్క జీవితము సార్థకము అవుతుంది. కాలముకోసం మనము కాచుకోనక్కరలేదు, వేచుకోనక్కరలేదు. కాలమే మీ దగ్గరకు పరుగెత్తి వస్తుంది. సామాన్యమైన మానవులు కాలానుగుణ్యంగా అనుభవిస్తూ వస్తుంటారు. మహనీయులు కాలాన్ని తనకనుగుణముగా మార్చుకుంటూ వస్తారు. కాలమే మంచివారిని అనుసరిస్తూ

sri sathyasai vachanamrutam

వస్తుంది. కాలాన్ని మనం హస్తగతము చేసుకోవాలి. అప్పుడే కాయము సార్థకమవుతుంది. కాలముననుసరించకపోతే కాయము అనర్థకమవుతుంది. దేహము చాలా పవిత్రమైనటువంటిది. 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నారు. కనుకనే దీనిని 'తుంగభద్రాయ నమః' అన్నారు. దేహమునకు తుంగభద్రుడని పేరు. భద్రుడనగా శాశ్వతుడని అర్థం. తుంగ అనగా కళ్యాణకరము అని అర్థం. శాశ్వతమైన కళ్యాణకరమైన కార్యములు అందించడానికి ఈ దేహము వచ్చింది. పవిత్రమైన కార్యములు చేయు నిమిత్తమై ఈ దేహము వచ్చినప్పుడు నీవు ఈ దేహమును ఎంత అపవిత్రము చేస్తున్నావు. దేహమనేది వెదురు కఱ్ఱలాంటిది. దానికి అనేక చోట్ల గంట్లు ఉంటుంటాయి. వీటికి గ్రంథులు అని పేరు. అనగా మానవ జీవితములోనూ అనేక విధములైనట్టి గ్రంథులుంటున్నాయి. కనుక, అనేక కష్టనష్టములకు గురవుతున్నాడు. దేహమునకు వుంటే వుండవచ్చును కాని హృదయమునకు రాకుండా చూచుకొనవలెను. నిరంతరము హృదయము నిర్మలంగా ఉంటుండాలి. భ్రమించని దృష్టిని, చలించని మనస్సును అలవాటుగా చేసుకోవాలి. వ్యక్తిగతమైన భావాలకు అవకాశమందించకూడదు. మానవుడు వ్యక్తిగతజీవి కాదు, సమిష్టిజీవి. ఈ సత్యాన్ని నీవు గుర్తించినప్పుడు వ్యక్తిగత జీవితాన్ని లెక్కచేయవు. సమిష్టిజీవి కనుక సమాజములో నీవు జీవించగలుగుతున్నావు. కనుక సమాజముయొక్క తత్వాన్ని చక్కగా గుర్తించుకుంటూ రావాలి.

**'మానవ' అంటే ఏమిటి?**

మానవుడనగా అజ్ఞానము లేకుండా ప్రవర్తించినటువంటి వాడు. 'మా' అజ్ఞానము, 'న' లేకుండా, 'వ' వర్తించటం. 'మా' అనగా కాదు, 'నవ' అనగా క్రొత్తవాడు. అనగా నీవు క్రొత్తవాడు కాదు, పాతవాడివే. ఎన్ని జన్మలనుండి వస్తున్నావు. సూర్యుని వెలుగు చంద్రునిపైన ప్రసరిస్తుంది. కాని, సూర్యచంద్రుల వెలుగు ఒక్కటే. సూర్యుని వెలుగు వెచ్చగా వుంటుంది. చంద్రుని వెలుగు చల్లగా వుంటుంది. 'చంద్రమా మనసో జాతః చక్షోసూర్యోఅజాయత'. దీనికి కారణమేమిటి? చంద్రుడు మనస్సుకు సంబంధించినటువంటివాడు. చక్షువులు జ్ఞానానికి సంబంధించినటువంటివి. కనుకనే మన జ్ఞాననేత్రములు సూర్యుని వెలుగుగా వుంటుండాది. చంద్రుని వెలుగు స్వప్రకాశము

కాదు కాబట్టి అంతయును సంచరిస్తుంది. కాబట్టి మనస్సుకూడా సంచరించే గుణము కలిగియుంటుంది. లోకాన్ని ఆకర్షించేది మనస్సు. జ్ఞానాన్ని ఆకర్షించేది సూర్యుడు. కావున మానవుడు జ్ఞానప్రకాశుడు కావాలి గాని, లోకప్రకాశుడు కాకూడదు. లోకానికి అనుభవించుకాని దైవానుగుణంగా మార్చుకో. అదియే నిజమైనట్టి మానవత్వము. ఈ విధమైనట్టి మానవత్వమును మీరు నూతన యుగమునుండి, సంవత్సరమునుండి అలవరచుకుంటే దేశానికి ఎంతో ఉపయోగపడిన వారవుతారు. మీరు ఏవిధమైనటువంటి రంగంలోకి ప్రవేశించండి. కాని, మీ హృదయస్థానాన్ని మార్చుకోకండి. అప్పుడే శాశ్వతమైన కీర్తిని పొందినవాడవవుతావు. అశాశ్వతమైన దానిని పొందడానికి ఈ జన్మము ఉండనక్కరలేదు. 'జంతూనాం నరజన్మ దుర్లభం'. యింత దుర్లభమైన మానవ జన్మమెత్తికూడను అసత్యమైన, అశాశ్వతమైన, అనిత్యమైన జగత్తును అనుభవిస్తుంటే యింక ఏనాడు శాశ్వతమైన సత్యాన్ని పొందేది.

**విద్యార్థిదశ చాల విలువైనది**

విద్యార్థులారా! యీ వయస్సు చాలా గొప్పది, దీనిని గోల్డెను ఏజ్ అంటారు. దీనిని వ్యర్థము చేసుకోకూడదు. కాలమును వ్యర్థము గావించినపుడు కాయమంతా వ్యర్థమైపోతుంది. కనుక కాలమే దైవస్వరూపము. Time waste is life waste. Time is GOD. Don't waste time. కనుక కాలమును వ్యర్థం చేసుకోకుండా మీమీ కర్తవ్యాలను నిర్వర్తించుకుంటూ రండి. పెద్దలను గౌరవించండి. తల్లితండ్రులను ప్రేమించండి. సమాజసేవలు చేయండి. అదే నిజమైన కర్తవ్యము. యీ విధమైనటువంటి వినయవిధేయతలను పెంచుకున్నప్పుడే విద్యకు అర్థముంటుంది. 'విద్యా వినయ సంపన్నే'. విద్యకు వినయము చాలా అవసరము. సద్గుణంబులు, సద్బుద్ధి, సత్యనిరతి, భక్తి, క్రమశిక్షణ, కర్తవ్యపాలనము నేర్పునదే విద్య. ఇలాంటి గుణములు లేకుండా విద్యావంతులంటే ఏమి ఫలితము. ఈ విద్యద్వారా మనము వినయాన్ని పెంచుకోవాలి. పెద్దలను గౌరవించాలి. మంచి పలుకులు పలకాలి. You can't always oblige but you can speak always obligingly. ఇతరులను కష్టపెట్టకుండా నీవు మాట్లాడు. వారి నిమిత్తమై నీవు నీ మనసును కష్టపెట్టకూడదు. నీవు ఆనందముగా వుండు. ఇతరులను ఆనందపెట్టు. 'నొప్పించక తానొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు' అన్నారు. ఈ విధమైన జీవితమును గడుపుతూ రావాలి. భక్తి అనగా పూజలు చేయటము, భజనలు



srisathyasaivahini

చేయటము, ధ్యానము చేయటము నిజమైన భక్తి కాదు. వీటిని భక్తి కన్నా సత్కర్మలు అని చెప్పవచ్చు. అనురక్తిని పెంచుకొని దానిని విరక్తిగా మార్చుకొని రక్తిగా తీర్చి దిద్దుకొని ముక్తిని పొందాలి ఇదియే నిజమైన భక్తి. ముక్తి ప్రత్యేకంగా లేదు, లోకసంబంధమైన విరక్తియే ముక్తికి మార్గము, మోక్షమంటే ఏమిటి అర్థము? మోహక్షయమే మోక్షము అన్నారు. కోరికలు వుండాలి కాని పరిమితంగా పెట్టుకోవాలి. Less luggage, more comfort, make travel a pleasure.

## విద్యార్థులే నా ప్రాపర్టీ

ఈ క్రొత్త సంవత్సరమునుండి పిల్లలు వినయవిధేయతలను పెంచుకొని పవిత్రమైన ఆదర్శాన్ని అందించేటువంటి విద్యార్థులుగా తయారైనప్పుడే నాకు చాలా ఆనందముగా వుంటుంది. నిన్న మాయొక్క ట్రస్టు మీటింగులోపల నేను ఒక విషయము చెప్పాను. ఇందులాల్‌షా కూడా ఇక్కడే వుంటున్నాడు. నాకు ఈ ప్రాపర్టీలతో, ధనముతో సంబంధము పెట్టకండి. ఈ ధనముతోగాని, ప్రాపర్టీలతో సంబంధము లేకుండా కేవలము భక్తులతోనే సంబంధముంటున్నది. ఈ విధముగా నిర్ణయము తీసుకొని సంతకము చేసి యిచ్చేసాను. నాయొక్క ప్రాపర్టీ అంతా మీరే. యింత తరగనటువంటి ఆస్తిని యుంచుకొని తరిగేటువంటి ఆస్తిని నేను ఎందుకు ఆశించాలి. నా పిల్లలే నాకు ప్రాపర్టీ. మంచి ఆశయము వారు పొందినారంటే అంతకంటే నాకు ఆనందములేదు. అదే మీరు నాకిచ్చినట్టి సుంకము. ఏవిధమైనట్టి డబ్బులు నేను తీసుకోడంలేదు. ఎటువంటి ఫీజులు తీసుకోవడంలేదు. ఒక్క ఫీజు నేను అడగక తప్పదు. అదియే ప్రేమ అనేటువంటి ఫీజు. దానిని అర్పించినట్లయితే అన్నీ అర్పించినవారవుతారు. మీరు దేశమునకు కీర్తిని తేవాలి.

## సమ్యగ్దృష్టి- సత్కర్మ

లక్ష్మణుడు సర్వము వదలి రాముని సేవ చేయుటకై పదునాలుగు సంవత్సరములు అరణ్యవాసము చేసాడు. ఈ అరణ్యవాస సమయములో సీతారాములకు సేవ చేస్తున్నప్పటికిని సీత ముఖము ఏనాడు చూడలేదు. కారణము ఏమిటి? పరస్త్రీని చూడటం మహాపాపం అన్నారు. అన్న భార్య తల్లి వంటిది. తల్లిగా భావించుకున్నాడు. కనుక దృష్టిని మంచిగా చూచుకోవాలి. చేసే కర్మలను పవిత్రమైనవిగా మార్చుకోవాలి.

srisathyasaivachanamrutam

**See no evil, see what is good**
**Talk no evil, talk what is good**
**Hear no evil, hear what is good**
**Think no evil, think what is good**
**Do no evil, do what is good**
**This is the way to GOD.**

కన్నులున్నవి కదాయని కాకి వలె చూడటం కాదు. కాకి అన్నీ చూస్తుంది, దేనిని చూస్తుంది చెడు పదార్థములను చూస్తుంది. మన కన్నులు దైవాన్ని చూడడానికి ప్రయత్నించాలి. కన్నులు మూసుకున్నా, తెరచుకున్నా భగవంతుడే మనకు కనబడాలి. యీ విధమైనట్టి దృష్టి మనము పెట్టుకున్నప్పుడే సృష్టి అంతా మారిపోతుంది.

### ప్రతి క్షణము నూతన సంవత్సరమే

ప్రేమాత్మస్వరూపులారా! ఈనాడు క్రొత్త సంవత్సరము కాని యిది ఆంగ్ల సంవత్సరము. భారతీయ సంవత్సరముకూడా వేరుగా వస్తుండాది. రెండుగా జరుపుకుంటుంటారు, సూర్యకాలము, చంద్రకాలమని జరుపుకుంటారు. దక్షిణాది వారంతా కూడను చాంద్రమాసము ప్రకారము క్రొత్త సంవత్సరము జరుపుకుంటారు. ఉత్తరాది వారంతాకూడను సూర్యకాలము ప్రకారము జరుపుకుంటారు. ఇవన్నియూ వారి వారి అనుకూలమును బట్టి జరుపుకుంటారు. ఏ విధముగా జరిపినప్పటికిని క్రొత్త సంవత్సరము, క్రొత్త సంవత్సరమే. కాని ప్రతి సెకండును కూడా మీరు క్రొత్తదిగానే భావించండి. దైవ ప్రీతికరమైన కర్మలు మీరు చేసుకొని రండి. దైవ ప్రేమను పెంచుకోండి. ఏది వుండినా లేకపోయినా దైవప్రేమ వుండినట్లయితే సర్వమును సాధించగలవు.

సత్యహరిశ్చంద్రుడు భార్యను, రాజ్యమును, సర్వమును కోల్పోయాడు, చివరికి కాటికాపరయ్యాడు. కాని, సత్యమునుండి ఏమాత్రము వెరువలేదు. సత్యముకోసం సర్వము అర్పితము చేశాడు. సత్యమే దైవమని భావించాడు. ఆఖరికి దైవము పోగొట్టుకున్న రాజ్యము, భార్య, బిడ్డను అంతా కూడను తిరిగి యిచ్చాడు. అట్టి త్యాగము చేసినప్పుడు సర్వము సాధించిన వారమవుతాము. అట్టి సాధనలకు మీరు సంసిద్ధులుగా తయారుకావాలి. యీ క్రొత్త సంవత్సరమునుండి మీరందరు సుఖముగా, సంతోషముగా, ఎటువంటి బాధలు లేకుండా, ఆనందముగా, ఆహ్లాదముగా, ఆరోగ్యముగా వర్ధిల్లాలని నేను

srisathyasaivachanamrutam

ఆశీర్వదిస్తున్నాను, ఆశిస్తున్నాను. ప్రాచీన సంవత్సరమునుండి నేను ఆశీర్వదిస్తూ వస్తున్నాను. 'శతమానం భవతి, శతాయుః పురుష శతేంద్రియై .....ప్రతితిష్ఠతి' అని ఆశీర్వదిస్తారు. నూరు సంవత్సరములు ఎందుకోసం బ్రతకాలి, మంచిని సంపాదించుకోడానికోసం బ్రతకాలి. లేకపోతే ఎందుకు నూరు సంవత్సరములు బ్రతికి ప్రయోజనము ఏమిటి? మీరందరు జీవించండి. Long life, healthy life, happy life, peaceful life and divine life. ఆ డివైన్ లైఫ్‌తోనే మీ జీవితాన్ని సార్థకము చేసుకోండి.

**(తేదీ 01-01-1998న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam